



మిలాన్ ప్రదర్శనను తిలకిస్తున్న తూర్పు నావికాదళం చీఫ్ రాజేష్ పెందార్కర్. చిత్రంలో సీపీ రవిశంకర్ అయ్యనార్, ఇతర అధికారులు వున్నారు

మిలాన్ మెరుపులు

గగనతలంలో హాక్ యుద్ధ విమానాల ప్రదర్శన

ఆర్కే బీచ్ రోడ్డులో రెండు వేల మందితో ఫుల్ డ్రెస్ రిహార్సల్

- ఇంటర్నేషనల్ సిటీ పరేడ్... పాల్గొన్న 50 దేశాల ప్రతినిధులు
- యుద్ధ విమానాల విన్యాసాలతో దద్దరిల్లిన గగనతలం



తేజస్ యుద్ధ విమాన విన్యాసం



సముద్రంలో జాతీయ పతాక రంగులతో వాటర్‌బాంబుల బ్లాస్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):

'మిలాన్' మెరుపులతో ఆర్‌కే బీచ్ అదిరిపోయింది. యుద్ధ విమానాల విన్యాసాలతో ఆకాశం దద్దరిల్లిపోయింది. నేవీ బృందాల సంగీతంతో, సైనిక విద్యార్థుల నృత్యాలతో సాగరతీరం పులకించిపోయింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన నౌకా దళాలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ (అంతర్జాతీయ నగర కవాతు) ఫుల్ డ్రెస్ రిహార్సల్ అబ్బురపరచింది. భారత వైమానిక దళం శక్తి సామర్థ్యాల ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అతిథిగా విచ్చేశారు.


ఆర్కే బీచ్‌రోడ్డులో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు 100 నిమిషాలు నిరాటంకంగా కొనసాగాయి. మిత్రదేశాలతో అంతర్జాతీయ అవగాహన, విశ్వజనీన స్నేహభావన పెంపొందించేలా సాగిన కవాతు ఆద్యంతం ఆకట్టుకుంది. వైమానిక దళంలో ఉన్న సీ కింగ్ హెలికాప్టర్లు, సీ హాక్‌లు, చేతక్‌లు, డార్నియర్లు, జెట్ ఫైటర్లు, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానాలు, భూమిపై, సముద్రంపై పనిచేయగల యుహెచ్‌3హెచ్ హెలికాప్టర్లు, మిగ్ 29కే విమానాలు వాటి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి. 'ఫ్లై పాస్ట్' పేరుతో 60 యుద్ధ విమానాలు వరుస క్రమంలో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. మెరైన్ కమెండోల సాహస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, మలేషియా, వియత్నాం, రష్యా, ఫ్రాన్స్, ఇరాన్, మారిషస్ దేశాల నేవీ దళాలు, సీ కాడెట్లు, ఏపీ పోలీస్, ఎన్‌సీసీ, కోరుకొండ సైనిక్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ కోస్టుగార్డ్ బృందాలు కవాతు నిర్వహించాయి. నేవీ స్కూల్ విద్యార్థులు వివిధ రంగులతో భావావేశాలను ప్రదర్శించే నృత్యరూపకం కరతాళ ధ్వనులు అందుకుంది. యుద్ధ విమాన వాహక నౌకలు విక్రాంత్, విక్రమాదిత్యలు గంభీరంగా సముద్రంలో నిల్చొని భారత నౌకదళం శక్తిని ప్రతిబింబించాయి.



ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో పాల్గొన్న నావికాదళ సైనికులు. - మరిన్ని ఫొటోలు I పేజీలో

వివిధ ప్రాంతాల్లో రెండో రోజు

మిలాన్ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆరోగ్య నడక, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. డాల్ఫిన్ కొండపై 600 మందికి పైగా ట్రెక్కింగ్ చేశారు. యారాడ బీచ్‌లో యోగా నిర్వహించారు. యాభై దేశాల నుంచి వచ్చిన యువ నేవీ ఆఫీసర్లు అనుభవాలను పంచుకున్నారు. వీరంతా కలిసి ఐఎన్ఎస్ తరంగిణి నౌకపై సెయిలింగ్ చేశారు. హిందూస్థాన్ షిప్‌యార్డులో డీప్ సబ్‌మెర్జిన్ రెస్క్యూ వెహికల్ ద్వారా సబ్‌మెరైన్లను రక్షించే విధానం చూపించారు.



హెలికాప్టర్ నుంచి సముద్రంపైకి దిగుతున్న కమాండో

శంఖారావం విజయవంతం

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సభలు

కేడర్‌కు తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిశానిర్దేశం

- అధికార పార్టీ నేతల భూ దందాలను ఎండగట్టిన యువనేత
- ఎక్కడికక్కడ స్థానిక సమస్యల ప్రస్తావన... పరిష్కారానికి హామీ
- 'సూపర్ సిక్స్' పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు పిలుపు



పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్లలో మంగళవారం సాయంత్రం జరిగిన శంఖారావం సభలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్. సభకు హాజరైన జనం. - వార్త మెయిన్ ఎడిషన్‌లో

- విశాఖపట్నాన్ని గుండెల్లో పెట్టుకుంటామని ప్రకటన
- ఆర్థిక రాజధానిగా, ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విశాఖ నగరంలో మూడు రోజులపాటు నిర్వహించిన 'శంఖారావం' కార్యక్రమం నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. కేడర్‌కు దిశా,నిర్దేశం చేస్తూనే భరోసా కల్పించేలా లోకేశ్ పర్యటన సాగింది. అధికార పక్షంపై విమర్శనాస్త్రాలు సంధించిన ఆయన...అదే సమయంలో పార్టీ కార్యకర్తలకు మానసిక స్థైర్యాన్ని ఇచ్చేందుకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు.

పార్టీ రూపొందించిన 'సూపర్ సిక్స్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిందిగా పిలుపునిచ్చారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు అవార్డు/ప్రశంసాపత్రం అందజేశారు. జనసేనతో పొత్తు నేపథ్యంలో అధికార పార్టీ నేతలు సాగించే విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యకర్తలు నాయకుల చుట్టూ కాకుండా ప్రజల మధ్య తిరిగితే అధికారంలోకి వచ్చిన పదవులు కట్టబెడతామని హామీ ఇచ్చారు.

అధికార పార్టీ నేతలపై నిప్పులు

అధికార పార్టీ నేతల అక్రమాలపై లోకేశ్ ఘాటుగా స్పందించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనా విధానాలపై, స్థానిక వైసీపీ పెద్దలు, ఎమ్మెల్యేలు, నేతల అడ్డగోలు వ్యవహారాలపై తనదైన శైలిలో లోకేశ్ నిప్పులు చెరిగారు. సీఎం జగన్ విశాఖను పాలనా రాజధాని చేస్తామని చెప్పి.. గంజాయి కేపిటల్‌గా చేశారంటూ విమర్శలు గుప్పించారు. టీడీపీ హయాంలో ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న విశాఖ నగరం..వైసీపీ పాలనలో కిడ్నాప్‌లు, హత్యలకు కేంద్రంగా మారిందంటూ ఉదాహరణలు జోడిస్తూ లోకేశ్ చేసిన ప్రసంగం ప్రజల్లో ఆలోచన రేకెత్తించింది. విశాఖ నగరంలో వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములు, హయగ్రీవ, సీబీసీఎంసీ భూములను కొట్టేశారంటూ వైసీపీ నేతలపై ఆరోపణలు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామని ప్రకటించారు. జగన్ రుషికొండకు గుండు కొట్టించి రూ.500 కోట్లతో విలాసవంతమైన ప్యాలెస్‌ను కట్టుకున్నాడని, అధికారంలోకి వస్తే దీన్ని ప్రజలకు అప్పగిస్తామని లోకేశ్ స్పష్టంచేశారు.

పెందుర్తి నియోజకవర పరిధిలోని కృష్ణరాయపురంలో తొలిరోజు నిర్వహించిన సభలో స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అక్రమాలపై లోకేశ్ విరుచుకుపడ్డారు. చెరువులు, భూములు ఆక్రమించుకోవడం, క్వారీలు, కొండలు తవ్వుకోవడం తప్ప.. ప్రజలకు ఉపయోగపడే పనులు ఏమీ చేయలేదంటూ విమర్శలు గుప్పించారు. అదేరోజు సాయంత్రం భీమిలిలో నిర్వహించిన సభలో స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన రాసలీలలతో భీమిలికి చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, అవుట్‌సోర్సింగ్ పోస్టులను ఎమ్మెల్యే అమ్ముకున్నారని, చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు అన్యాయం చేశాడంటూ ఎమ్మెల్యే ముత్తంశెట్టిపై లోకేశ్ విమర్శలు గుప్పించారు. విశాఖ తూర్పులో నిర్వహించిన సభలో లోకేశ్ ... మిగతా 6వ పేజీలో

జనాన్ని తెండి...



ఎయిర్‌పోర్టు వద్ద సీఎం రాక సందర్భంగా రోడ్డు పక్కన బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులకు టార్గెట్లు

నేడు విశాఖ శారదా పీఠానికి రానున్న ముఖ్యమంత్రి

- విమానాశ్రయం నుంచి పీఠానికి వెళ్లే మార్గంలో పాయింట్‌కు 500 మంది ఉండాలని లక్ష్యం
- ఆర్‌పీలు, వలంటీర్లకు బాధ్యతలు
- జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అంటే విశాఖలో అధికారులతో పాటు ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఆయన వచ్చిన ప్రతిసారీ జన సమీకరణ చేయాలని ఆదేశిస్తున్నారు. వాహనం అద్దాలు దించని చోట కూడా ప్రజలతో చేతులు ఊపించాలని శాసిస్తున్నారు. దాంతో జనాలను తరలించడానికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఈసారి పార్టీ నాయకులకు కాకుండా అధికారులకే అన్ని బాధ్యతలు అప్పగించారు.

చినముషిడివాడలోని శారదాపీఠంలో రాజశ్యామల పూజలో పాల్గొనడానికి సీఎం బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. ఆయన విజయవాడ నుంచి బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా గోపాలపట్నం, వేపగుంట, పురుషోత్తపురం మీదుగా చినముషిడివాడలో గల పీఠానికి వెళతారు. అక్కడ గంట సేపు ఉండి పూజలు చేస్తారు. 12.40 గంటలకు తిరిగి బయలుదేరి 12.55 గంటలకు విమానాశ్రయం చేరుకొని విజయవాడకు వెళతారు. ఆయన పీఠంలో ఉండేది కేవలం గంట మాత్రమే. విమానాశ్రయం నుంచి 15 నిమిషాలు ప్రయాణిస్తే పీఠం వస్తుంది. అయితే ఈ మార్గంలో 24 పాయింట్లు గుర్తించి, అక్కడ జనాలను ఉంచాలని జీవీఎంసీ అధికారులకు పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కో పాయింట్ వద్ద 500 మందికి తక్కువ లేకుండా చూడాలని సూచించారు.

డ్వాక్రా గ్రూపు మహిళలను తరలించే బాధ్యతలను రీసోర్స్ పర్సన్లకు, పెన్షనర్లను తీసుకువచ్చే బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. వీరిని సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యత పీడీలు, ఏపీడీలకు కట్టబెట్టారు. జోనల్ కమిషనర్లు పైనుంచి అన్నీ చూసుకోవాలని సూచించారు. ప్రధాన మార్గం నుంచి ఎంత దూరంలో ప్రజలు నిల్చోబెట్టాలనే విషయం కూడా స్పష్టంగా ఆయా అధికారులకు ... మిగతా 6వ పేజీలో

ఐఐఎం క్యాంపస్ ప్రారంభం



ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం) క్యాంపస్‌ను ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...

గంభీరంలోని క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఐఎం ఉన్నతాధికారి. చిత్రంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నారు.

2 గంటల్లో 187 అంశాలు

- అన్నింటినీ ఆమోదించేసిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ
- పూర్తయిన పనులకు ఇప్పుడు పరిపాలనా ఆమోదం
- కనీసం ఒక్క సభ్యుడు కూడా ప్రశ్నించని వైనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఏకంగా 187 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించేశారు. కనీసం చర్చ కూడా లేకుండా రెండు గంటల్లో అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలపడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ప్రధాన ఎజెండాగా 136 అంశాలు, టేబుల్ ఎజెండాగా 51 అంశాలను పొందుపరిచారు. ఒక్కో అంశంపై లోతుగా చర్చించిన తర్వాత నిర్ణయం తెలపాల్సిన సభ్యులు, అందుకు విరుద్ధంగా ఒకే సారూప్యత కలిగిన అంశాలంటూ కనీసం చదవాలని సిబ్బందిని ఆదేశించకుండానే ఆరేసి, ఏడేసి అంశాలను ఆమోదించేసినట్టు ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకరోజంతా జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి 70, 80 అంశాలు మించకుండా ఎజెండా ... మిగతా 6వ పేజీలో



సింగాలమ్మపురంలో డ్రైనేజీలో మురుగు నీరు



ఏఎస్ఆర్ నగర్‌లో దుస్థితి..

అధ్వానంగా డ్రైనేజీలు

» 45వ వార్డు పరిధిలో దుస్థితి

» పొంచి ఉన్న వ్యాధుల భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 20: గ్రేటర్ 45వ వార్డు పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. పలు వీధుల్లో కాలువలకు చాలా ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసనకు ముక్కుమూసుకొని వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. పలుచోట్ల డ్రైనేజీలకు ఇరువైపులా గట్లు విరిగిపోవడంతో వర్షాలు కురిసే సమయంలో మురుగునీరు రహదారులపై పారుతోంది. స్థానికులు ఇళ్లనుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వాటిలోని చెత్త చెదారాలను సకాలంలో తొలగించకపోవడంతో సమస్యలు అధికమవుతున్నాయి. డ్రైనేజీల్లో మురుగునీరు,చెత్తలతో నిండిపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నారు. వీధుల్లో జనాలను వ్యాధులతో భయాందోళన చెందుతున్నారు. సింగాలమ్మపురం, ఏఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య అధికంగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీల ఇరువైపులా విరిగిపోయిన గట్టు నిర్మించాలని, లేకుంటే పునఃనిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'పాలగుమ్మి'కి ఘంటసాల సేవా పురస్కారం



రాజగోపాల్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20: సినీ నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా సేవలందిస్తున్న పాలగుమ్మి రాజగోపాల్‌కు ఘంటసాల స్మారక ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు హాజరై మాట్లాడుతూ సాలూరి రాజేశ్వరరావు వద్ద రాజ్‌గోపాల్ సహాయకునిగా ఉంటూ పలు చిత్రాలకు, అల్బమ్స్‌కు స్వరకర్తగాపనిచేయడమే కాక ఎన్నో సినిమా పాటలు పాడారన్నారు.సంస్థ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కళావేదిక ట్రస్ట్ అధ్యక్షుడు నండూరి రామకృష్ణ, గంటి మురళి, కొణతాలరాజు, జనార్దన్, యాదకుమార్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి'



ఏపీఎన్‌జీవో నేతకు వినతి పత్రాన్ని అందిస్తున్న స్టాఫ్ నర్సులు

మహరాణిపేట, ఫిబ్రవరి 20: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల స్ట్రగుల్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఎన్‌జీవో భవన్‌లో ఎన్‌జీవోజిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావును కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి కాంట్రాక్ట్ నర్సుల సమస్యలుతెలిపి,పరిష్కారానికి కృషి చేయాలని ఎన్‌జీవో అసోసియేషన్‌ను కోరామన్నారు. రెగ్యులర్ చేసే వరకు వంద శాతం గ్రాస్ శాలరీ వచ్చేలా చర్య లు జరపాలని సూచించారు. సమావేశం లో నర్సింగ్ అసోసియేషన్ నాయకులు పిట్టా వరలక్ష్మి, లక్ష్మి, గంగా భవాని, లక్ష్మి, జ్ఞానాంబ, శ్రీగౌరీ మంగ, కోటేశ్వరరావు బాలమణి, ప్రశాంతి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో హరిహర నామ సంకీర్తన



పూజల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 20: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో 24 గంటల హరిహర నామ సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, టీడీపీ 42వవార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, నాయకులు లక్ష్మీ శివప్రసాద్, ముక్కి రామకృష్ణ, మజ్జి వెంకట సత్యనారాయణ, గంగరాజు, గురుగోవింద్ సింగ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జగన్ స్వప్రయోజనాలకు రాష్ట్రం తాకట్టు

» ఏఐవైఎఫ్ ప్రతినిధి రాంబాబు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

అల్లిపురం, ఫిబ్రవరి 20: సొంత ప్రయోజనాలకోసం తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ పెద్దల వద్ద జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రతినిధులు వై. రాంబాబు, కె. అచ్యుతరావు విమర్శించారు. మంగళవారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి కోసం కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలువంచి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను సాధిస్తానని చెప్పిన జగన్.. ఇప్పుడు మెజారిటీ అంటూ సాకులు చెబుతున్నారనిఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖకు ఎన్నిసార్లు వస్తున్నా స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూశారా.. అని ప్రశ్నించారు. నిరుద్యోగులను నమ్మించి వారి జీవితాలతో ఆడుతున్న జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దింపడమే ఏఐవైఎఫ్ ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. సమావేశంలోనాయకులు నాగరాజు, సాయి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పంచాలి

» జిల్లా రిజిస్ట్రార్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ బాలకృష్ణ



ప్రసంగిస్తున్న డీఐజీ బాలకృష్ణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20: ప్రతీ విద్యార్థి విజ్ఞానాన్ని సంపాదించి మరో పది మందికి ఆ జ్ఞానాన్ని అందించేలా నిలవాలని జిల్లా రిజిస్ట్రార్ అండ్ స్టాంప్స్ విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జి.బాలకృష్ణ సూచించారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో ప్రేమ ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల 72వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గీతం మెడికల్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డా.రమణారావు , ప్రేమ సమాజం ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు మాట్లాడుతూ జీవితంలో ఏం కావాలన్నా చదువు కీలకమన్నారు. కరస్పాండెంట్ డబ్ల్యు.భాస్కరరావు, డా. రాంజీ, ఎడ్యుకేషనల్ కమిటీ ఛైర్మన్ వి.కె. సురేష్, జగదీష్, కోన జగదీశ్వరరావు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా బహుమతులందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 20: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఏరియా, రెసోనెన్స్ స్టడీ సెంటర్, శారద స్కూల్ ఏరియా, శివాలయం వీధి, వివేకానంద కల్యాణమండపం ఏరియాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయగడ స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు



రాయగడ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20: రాయగడ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మంగళవారం తనిఖీలు చేశారు. ప్రయాణికుల మౌలిక సదుపాయాలకు సంబంధించి చేపట్టిన పాదచారుల వంతెన, పార్కింగ్ ఏరియా, స్టేషన్ భవన అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్పీఎఫ్ బ్యారక్‌ను కూడా పరిశీలించి సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఇప్పటివరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. అక్కడ నుంచి విండో ట్రాలింగ్ ద్వారా పార్వతీపురం, విజయనగరం రైల్వే స్టేషన్లను పరిశీలించి అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తాతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆలయాలకు భీష్మ ఏకాదశి శోభ



అలంకరణలో శ్రీ లీలా మాధవస్వామి

మురళీనగర్, ఫిబ్రవరి 20; భీష్మఏకాదశి వేడుకలను మంగళవారం మాధవధార, మురళీనగర్‌లలో ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. బర్మాక్యాంపు రోడ్డులోని సీతారామచంద్ర స్వామి ఆలయం 25వవార్షికోత్సవ ముగింపు సందర్భంగా సాయంత్రం 7 గంటలకు సీతారామ శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈనెల 18 నుంచి ఈ వేడుకలను శ్రీరామ వినాయక యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించారు. మాధవధార పుణ్య క్షేత్రంలోని శ్రీ మాధవస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ వేడుకలు జరిపారు. మాధవధార ఉడాకాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ 16వ వార్షికోత్సవ సంబరాలు జరిపారు. సాయంత్రం తిరువీధి జరిపారు.

వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు



రైల్వే గ్రౌండ్ కొత్తగా ఏర్పాటుచేసి ఫ్లడ్ లైట్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 20: వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో కొత్తగా ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. విశాఖ క్రీడారంగంలో ఘన చరిత్ర కలిగిన రైల్వే గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు అందుబాటులో రావడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్, వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు తదితర అవుట్‌డోర్ క్రీడా మైదానాలలో ఇప్పటికే ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు చేశారు. క్రికెట్ గ్రౌండ్‌లో అమర్చిన ఫ్లడ్‌లైట్లను మంగళవారం రాత్రి ట్రయల్ టెస్టు చేశారు. అయితే ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు వెచ్చించిన వ్యయాన్ని రైల్వే అధికారులు అధికారంగా తెలియజేయాల్సి ఉంది.

కేజీహెచ్‌లో కేన్సర్ రోగులకు మెరుగైన సేవలు

» హోమీబాబా రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి



నవ్య ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

మహరాణిపేట, ఫిబ్రవరి 20: కేజీహెచ్‌లో కేన్సర్ రోగుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో నవ్య ప్రాజెక్టు అపర సంజీవనిలా పనిచేయనుందని టాటా మెమోరియల్ అనుబంధ హోమీబాబా కేన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో టాటా మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో నేషనల్ కేన్సర్ గ్రిడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేజీహెచ్‌లో నవ్య ప్రాజెక్టు ద్వారా కేన్సర్ సేవలకు సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభించారు. అనంతరం కొంతమంది రోగుల ఆరోగ్య నివేదికలను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి జాతీయస్థాయిలో వైద్య నిపుణుల సలహా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా కేన్సర్ రోగుల ఆరోగ్యస్థితి, తీవ్రత ఉన్న బాధితులకు అదనపు వైద్య సలహాలు సూచనలిచ్చేందుకు ఆసుపత్రి వైద్యులకు జాతీయస్థాయి నిపుణులు తోడ్పాటునందిస్తారన్నారు. దీని ద్వారా రోగులకు మెరుగైన చికిత్స చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, రేడియేషన్ అంకాలజీ విభాధిపతి పాండురంగ కుమారి, నవ్య ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ నితిమాధుర్, డాక్టర్లు నరేశ్ రామరాజన్, శిల్ప, రాఘవేంద్ర నాయక్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



బల్లిగిరి వెంకన్న ఆలయ టస్ట్ ప్రమాణం స్వీకారం

అల్లిపురం, ఫిబ్రవరి 20: అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం నూతన ట్రస్ట్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ హాజరై సభ్యులతో ప్రమాణం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బొడ్డేటి కిషోర్, మెంబర్లుగా పాల్తేటి ఊర్వశి, తాడ్డి అనురాధ, కొణతాల కృష్ణవేణి, గంగుల మానస, కొల్లి సత్యవతి, వెలిసెట్టి లక్ష్మి తదితరుల ప్రమాణం చేశారు.

రూ.2500 కోట్ల ఐటీ ఎగుమతులు

» మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,500 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయని ఐటీ, పరిశ్రమలశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సర్క్యూట్‌హౌస్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో రూ.900 కోట్లు మాత్రమే జరిగాయన్నారు. 2017లో ఐటీ మంత్రిగా లోకేశ్ విశాఖ వచ్చినపుడు ఐటీ కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనువైన పరిస్థితులు లేవన్నారని, కానీతాము250 ఐటీ కంపెనీలను నెలకొల్పామన్నారు.చంద్రబాబు, లోకేశ్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

కొమ్మాది, ఫిబ్రవరి 20: దిశా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని పారిశుధ్యకార్మికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా, ఇతడు జూపార్కు ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్టు తెలిసిందన్నారు. మృతదేహంపై గాయాలు లేవని, కేజీహెచ్ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు పీఎం పాలెం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

41వ వార్డులో వికసిత్ భారత్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 20: జీవీఎంసీ జోన్-5 యూసీడీ ఆధ్వర్యంలో 41వవార్డు పరిధి జ్ఞానాపురం ఏఎస్ఎస్ఎంయూ ఆర్ఎం కాలనీ వద్ద మంగళవారం ప్రధానమంత్రి వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు వంక సంజీవరావు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్, బీజేపీ సీనియర్ నాయకులు రామ్‌కుమార్‌లు హాజరై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పథకాల అమలు, ప్రయోజనాలను దృశ్యరూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెలంగణిరావు, యూసీడీ సీఓ సత్యవతి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు నగర బహిష్కరణ పొడిగింపు

కొమ్మాది, ఫిబ్రవరి 20: స్థానిక ఆర్.హెచ్ కాలనీకి చెందిన రౌడీషీటర్ రెహాన్‌ను గతంలో పోలీస్ కమిషనర్ ఏడాది పాటు నగరం నుంచి బహిష్కరించారు. రెహాన్ వ్యవహార శైలిని దృష్టిలో పెట్టుకుని అతడి నగర బహిష్కరణను మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

శంఖారావం విజయవంతం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ సొంత కుటుంబ సభ్యులను రక్షించుకోలేని వ్యక్తి ఇక్కడకు కొత్తగా వచ్చాడని, ఆయనకు ఓటేస్తే మొత్తం భూములు కొట్టేస్తారంటూ ఎంవీవీ సత్యనారాయణను ఉద్దేశించి విమర్శించారు. మద్దిలపాలెం, హనుమంతువాకలో ఫ్లైఓవర్లు నిర్మిస్తామని, జాతీయ రహదారిపై పలుచోట్ల ప్రజలు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ఫుట్ బిడ్జిలు నిర్మిస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారి, అడ్డగోలుగా సంపాదించాడన్నారు. అటువంటి వ్యక్తులకు పార్టీలో చోటు లేదని స్పష్టంచేశారు. వన్‌టౌన్‌లో స్టేడియాన్ని, ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకరిస్తామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం సభలో కేకే రాజు గూండా గిరి చేస్తున్నాడని, నియోజకవర్గాన్ని గంజాయికి కేంద్రంగా చేశాడని దుయ్యబట్టారు. గాజువాక సభలో తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఉక్కు భూములు అమ్మకానికి పొరుగు రాష్ట్రంలో ప్రకటన జారీచేయడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం కనిపిస్తోందంటూ మండిపడ్డారు. త్వరలో ఏర్పడనున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో విశాఖను అన్ని రకాలుగా ఆదుకుంటామని స్పష్టంచేశారు. గడిచిన ఎన్నికల్లో రాష్ట్రమంతా టీడీపీకి ఎదురుగాలి వీచినా..విశాఖ నగరంలోని మాత్రం నాలుగు నియోజకవర్గాల్లో ప్రజలు టీడీపీ ఆదరించారని, ఇక్కడి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటామని చెప్పడం ద్వారా విశాఖ ప్రజల పట్ల తనకున్న కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీకి పెద్ద పీట వేస్తానని, మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయిస్తానని లోకశ్ హామీ ఇవ్వడం ద్వారా ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. మొత్తంగా లోకేశ్ పర్యటన విజయవంతం కావడంతో పార్టీ నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జనాన్ని తెండి...

... 5వ పేజీ తరువాయి

సూచించారు. విమానాశ్రయంలో టోల్‌ప్లాజా మొదలుకొని విమాననగర్ బస్టాప్, ఈటర్స్ స్టాపు, దుర్గానగర్ బస్టాప్, బిగ్ న్యూ మొబైల్ షాపు, విజేత సూపర్ మార్కెట్, రిలయన్స్ డిజిటల్స్, లక్ష్మీ షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, సింహాచలం పెట్రోల్ బంకు, గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రి, భారతి కల్యాణ మండపం, వేపగుంట జంక్షన్, జోన్-8 కార్యాలయం...ఇలా చినముషిడివాడ జంక్షన్ వరకు 24 పాయింట్లు గుర్తించారు. పాయింట్‌కు 500 మంది చొప్పున మొత్తం పది వేల మందికి తక్కువ లేకుండా జనాలను తేవాలని ఆదేశాలు అందాయి. ఏయే వార్డుల నుంచి జనాలను తీసుకురావాలో కూడా సూచించడం గమనార్హం. పశ్చిమ, పెందుర్తి, భీమిలి నియోజకవర్గాలకు చెందినవారితో పాటు 90, 91, 92, 94, 95, 97 వార్డులకు చెందిన వారిని తీసుకురావాలని చెప్పారు. విమానాశ్రయం నుంచి ఎక్కడా ఆగకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇది ఎన్నికల సీజన్ కాబట్టి కారు అద్దాలు దించి, చేతులు ఊపుతూ వెళతారని, అందుకే ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు.

2 గంటల్లో 187 అంశాలు

... 5వ పేజీ తరువాయి

తయారుచేస్తారు. అలాంటిది స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఒకేసారి 187 అంశాలను పొందుపరచడం, రెండు గంటల్లోపే వాటన్నింటినీ ఆమోదించడం చర్చనీయాంశంగా మారింది. పైగా స్టాండింగ్ కమిటీ ఎజెండాలో చేర్చిన కొన్ని పనులను ఇప్పటికే పూర్తి చేసేశారు. అలాంటి అంశాలకు ఇప్పుడు పరిపాలనా ఆమోదం ఇవ్వాలంటూ స్టాండింగ్ కమిటీ ముందుపెట్టిన అధికారులను సభ్యులు ఉతికిఆరేయాలి. కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా అభ్యంతరం లేవనెత్తకపోవడం అనేక అనుమానాలకు తావిచ్చింది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీవీఎంసీ దుకాణాల లీజులు పొడిగింపు, వేలం, ఆశీలు వసూలు, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్య విభాగంతో పాటు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో సభ్యులతోపాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భలే కప్ప!



తీరానికి చేరిన ముళ్ల కప్ప కళేబరం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 20: సముద్ర తీరానికి మంగళవారం ఓ ముళ్ల కప్ప కళేబరం కొట్టుకువచ్చింది. దీని శరీరమంతా ముళ్లతో నిండి ఉంది. శత్రువుల నుంచి రక్షించుకునేందుకు ఇది ముళ్లను వినియోగిస్తుంటుందని మత్స్యకారులు తెలిపారు. ఇది ఉభయచర జీవి కాదని, నీటిలోంచి బయటకు వచ్చిన మరుక్షణమే మృత్యువాత పడుతుందన్నారు. వింతగా వున్న కప్పను చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు.

ఏ దారెటుపోతుందో?

» తప్పులు తడకగా దిక్సూచీలు



కైలాసగిరి వైపు హెల్త్‌సిటీ, నగరంలోకి ఆరిలోవ మార్గాలను సూచిస్తున్న బోరు



నగరంవైపు జూ, జూవైపు వెంకోజీపాలెం, ఇసుకతోటను సూచిస్తున్న మార్కులు

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 20: ఎద్దు ఈనిందంటే దూడను కట్టేయ్ అన్నాడట ఓ పెద్ద మనిషి. అలా ఉంది అధికారుల పరిస్థితి. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇటీవల ప్రకటనల కోసం భారీ నిర్మాణాలను చేపట్టిన విషయం తెలిసిందే. వాటికి ఏ దారి ఎటు వెళ్తుందో సూచించే బోర్డులను కూడా ఏర్పాటుచేశారు. ఏదోలా కట్టేయండంటూ అధికారులు చెప్పారో, లేదా బోర్డులు అమర్చేవాడికి ఇంగ్లీషు పరిజ్ఞానం లేదోగాని మార్గాలు తికమకగా సూచించేలా అమర్చాడు. దాదాపు నెల రోజులు దాటుతున్నా ఈ బోర్డులను అధికారులు మార్చలేదు. అధికారుల దృష్టికి రావడంతో వాటికి ఓ వస్త్రాన్ని కప్పేయాలని సూచించారట ఘనతగన్న మహా విశాఖ అధికారులు. హనుమంతువాక నుంచి ముడసర్లోవ వెళ్లే రోడ్డులో ప్రయాణిస్తే... హెల్త్‌సిటీ, ఆరిలోవ మార్గాలను సూచించే బోర్డులు ఉండాలి. కానీ నగరంవైపు చూపిస్తూ జూ పార్కు, పి.ఎం.పాలెం క్రికెట్ స్టేడియం, జూ పార్కు వైపునకు వెంకోజీపాలెం, ఇసుకతోట మార్గాలను సూచిస్తున్నాయి. ఇక ముడసర్లోవ వైపు నుంచి హెల్త్‌సిటీ, ఆరిలోవ దాటుకుని జాతీయ రహదారిపైకి వచ్చేటప్పుడు హెల్త్‌సిటీ కైలాసగిరివైపు, ఆరిలోవ నగరంలోకి వెళ్లే మార్గం సూచిస్తున్నాయి. కనీసం వీటిని అమర్చే సమయంలో పర్యవేక్షించేవారు కూడా లేకపోతే పరిస్థితి ఇలానే ఉంటుందని నగరవాసులు విమర్శిస్తున్నారు.

ఆలోచింపచేసే చిత్రం 'సుందరం మాస్టర్'

» హీరో హర్ష



మాట్లాడుతున్న హీరో హర్ష

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 20: సుందరం మాస్టర్ సినిమా అందరిని ఆలోచింపచేసేదిగా ఉంటుందని ఆ సినిమా హీరో హర్ష అన్నారు. వైవా హర్ష, దివ్య శ్రీపాద జంటగా నటించిన సుందరం మాస్టర్ ఈ నెల 23వతేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం నగరంలోని ఎం.వి.పి.కాలనీలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో హర్ష మాట్లాడారు. ఈ చిత్రం టీజర్, ట్రయిలర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. హీరో రవితేజ ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎదిగారన్నారు. ఆయన నిర్మాతగా తీసిన సినిమా ద్వారా హీరోగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. తన స్నేహితుడు హీరో సాయిధరమ్ తేజ్ చేతులమీదుగా చిత్ర టీజర్, మెగా స్టార్ చిరంజీవి చేతులమీదుగా ట్రయిలర్ విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. గోల్డెన్ మీడియా అధినేతలది గాజువాక అని పేర్కొన్నారు. పాడేరు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇది ఫీల్‌గుడ్ మూవీ అని ఆర్ట్ డైరెక్టర్ చంద్రమౌళి అన్నారు.

ఫిట్‌నెస్‌తో ఉన్న వాహనాలను నడపాలి

ఆటోనగర్, ఫిబ్రవరి 20: రహదారిపై రాకపోకలు చేసే వాహనాలన్నీ ఫిట్‌నెస్‌తో ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీసత్యంనాయుడు పేర్కొన్నారు. ఆటోనగర్ కూడలిలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, వెనక కూర్చున్న వారు కూడా విధిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదాల మృతుల్లో ఎక్కువ మంది వెనక కూర్చున్న వారే ఉన్నారన్నారు. కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 20: విద్యార్థులు రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి వుండడంతో పాటు వాటిని ఆచరిస్తూ ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. మంగళవారం పాఠశాలలో రహదారి భద్రతా నియమాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. నిర్వాహకులు మళ్ల నాగేశ్వరరావు, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 20: మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఉజ్వల పథకం ద్వారా పేద మహిళలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 50 వంట గ్యాస్ కనెక్షన్లను మంగళవారం ఆయన గంగవరంలో మత్స్యకార మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగవరంలోని బీజేపీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు కావాలనుకునే పేద మహిళలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ 64వ వార్డు అధ్యక్షురాలు గరికెన మాధవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

ఆటోనగర్, ఫిబ్రవరి 20: జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో ఉన్న పైడితల్లమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గ ఎంపిక, ప్రమాణ స్వీకారాన్ని మంగళవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షునిగా బండారు సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేడ రమణ, కోశాధికారిగా వీఎల్ కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షునిగా జి.మోహనకృష్ణ, ఉపాధ్యక్షునిగా ఆడారి రామకృష్ణ ఎంపికయ్యారు. శ్రామికనగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రీనివాసనగర్ అధ్యక్షులుగా టి.వెంకటరత్నం, ఆర్.గోవిందరావు, అక్కునాయుడు, ఎ.కొండలరావులను ఎన్నుకున్నారు. అందరి సహకారంలో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని వారు ప్రమాణ స్వీకారం చేశారు.

ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 20: సమాజంలో అధికమవుతున్న నేత్ర, దంత వ్యాధుల పట్ల యువత అవగాహన కలిగి వుండడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో మంగళవారం తుంగ్లాం కాలనీలో నిర్వహించిన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 250 మందికి వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌వీఆర్ పాత్రుడు, ఎస్.శ్రీను, బీఎవీవీ నరసింహమూర్తి, బి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

వేపగుంట, ఫిబ్రవరి 20: జీవీఎంసీ 94వ వార్డు పరిధి కృష్ణానగర్ గుడివీధిలోని దుర్గామల్లీశ్వర అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం భక్తుల సహకారంతో చేపట్టిన టేకు రథాన్ని జనసేన నాయకుడు కంచిపాటి విశ్వనాథంనాయుడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం పురవీధుల్లో రథయాత్ర చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 22, క్యారెట్ 20, దొండకాయలు 40, బంగాళదుంపలు 17, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 106, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 34, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	123
ఫారం ధర	--	143
విత్ స్కిన్	--	256
స్కిన్‌లెస్	--	266

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



సింహాచలం రైల్వే స్టేషన్ నమూనా..



ఆధునీకరణ కోసం పనులు చేపట్టిన దృశ్యం

మారనున్న సింహాచలం రైల్వే స్టేషన్ రూపురేఖలు

'అమృత్ భారత్'లో భాగంగా ప్రారంభమైన ఆధునీకరణ పనులు

నిర్మాణ వ్యయం రూ.19.50 కోట్లు

గోపాలపట్నం, ఫిబ్రవరి 20: మహా నగరంలో ఎంతో ప్రాముఖ్యం ఉన్న స్టేషన్‌గా పేరొందిన సింహాచలం రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించేందుకు ఇటీవల రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సింహాచలం రైల్వే స్టేషన్‌ను రూ.19.5 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం ఇక్కడి రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్ ఫారాలు మాత్రమే ఉన్నాయి. స్టేషన్‌లోని వసతులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం 25 రైళ్లు మాత్రమే ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన సింహాచలానికి విచ్చేసే భక్తులు కూడా నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడ నుంచి సింహాచలం రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించడానికి పనులు ప్రారంభించడంతో సాధారణ ప్రయాణికులతో పాటు సింహాద్రి అప్పన్న దర్శనానికి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎంతో ఉపశమనం కలగనున్నది.

అధునాతన సౌకర్యాలతో అభివృద్ధికి చర్యలు

సింహాచలం రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగి దశాబ్దాల కాలంలో గడిచిన గత పదేళ్లలోనే ఎంతో అభివృద్ధి చెందింది. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల విస్తరణ, స్టేషన్ ప్రాంగణం ఆధునీకరణ వంటి పనులు గత పదేళ్లలో చేపట్టారు. ప్రస్తుతం అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్ అభివృద్ధికి సుమారు రూ.19.50 కోట్లు వెచ్చించనున్నారు.

ఈ నిధులతో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్‌ఫారాలతో పాటు అదనంగా మరో రెండు లైన్లు నిర్మించి ప్లాట్‌ఫారాల నిర్మాణం చేపట్టనున్నారు. అదేవిధంగా స్టేషన్ ప్రారంభంలోని భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ గోపురం నమూనాతో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రహదారి ఇరుకుగా ఉండడంతో స్టేషన్‌కు రైళ్లు వచ్చిపోయే సమయంలో ప్రయాణికుల రద్దీగా కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రయాణికులు ప్రధాన రహదారికి చేరుకునేందుకు స్టేషన్ లోపలి నుంచి సదరం అప్పలనాయుడు మార్గంలోకి వాహనాలు వెళ్లేలా రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అంతేకాకుండా స్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి వీలుగా అదనంగా మరో ఫుట్‌ఓవర్ వంతెనను నిర్మించనున్నారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న స్థలాన్ని చదును చేయడంతో పాటు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో ఏడాదిలో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని చెప్పవచ్చు.

కేవీ మూసివేత ప్రతిపాదనను విరమించుకోవాలి

సీఐటీయూ ప్లాంట్ ఆధ్వర్యంలో విద్యాలయం వద్ద ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదనను విరమించుకోవాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. కేవీలో 1, 11 తరగతుల్లో అడ్మిషన్‌లను నిలిపివేయడంతో యూనియన్ నాయకులు మంగళవారం స్కూల్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమందిని ఉన్నతులుగా మార్చిన కేంద్రీయ విద్యాలయం మూసివేత అత్యంత దుర్మార్గమన్నారు. కేవీ మూసివేత వల్ల స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పిల్లల చదువు భారంగా మారుతుందన్నారు. కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం, కేంద్రం దుర్మార్గంగా ఆలోచించి స్టీల్‌ప్లాంట్‌ను నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే కేవీలో అడ్మిషన్‌లను పునరుద్ధరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, డీవీ రమణారెడ్డి, వి.ప్రసాద్, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీనగర్‌లో ఉభయ దేవేరులతో పూజలందుకున్న శ్రీకృష్ణుడు



అగనంపూడి అభయాంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా భీష్మ ఏకాదశి పూజలు

వేకువజాము నుంచే ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

శ్రీనగర్, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయగణపతి, రమా సహిత సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ భగవానునికి పూజలు, అర్చనలు జరిపారు. పూజాది కార్యక్రమాల్లో అసోసియేషన్ ప్రతినిధులు ఆవాల సూర్యనారాయణ, కె.సహదేవుడు, బి.లక్ష్మణరాజులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే 87వవార్డు రాజులపాలెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి పంచామృతాభిషేకాలు, తోమాల సేవ నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. 70వ వార్డు చట్టివానిపాలెంలోని వైకుంఠ నారాయణ అవతార క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర శతనామావళితో అర్చనలు చేశారు. శ్రీవారితో పాటు ఉభయ దేవేరులను బంగారం, వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.



పూజలందుకున్న గ్రీన్‌సిటీలోని శ్రీవారు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస భక్తాంజనేయస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామి వారిని నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బుదిరెడ్డి అప్పారావు, విందులు వరహాలు, ఐఆర్‌సీ అప్పారావు, ఎం.రామచంద్రరావు, బి.శ్రీను, పైడిరాజు, వెంకటేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి. జంక్షన్: జీవీఎంసీ 52, 90 వార్డుల పరిధిలో ఉన్న ఉన్న వైష్ణవాలయాల్లో భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కాకానీనగర్, విమాన్‌నగర్‌లలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో జరిగిన పూజల్లో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధిలోని రవిన గర్ శేషాద్రికొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో, వేపగుంట బీసీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు మరింత కృషి

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు, నల్లూరు సూర్యనారాయణ

గాజువాక/కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మరింత కృషి చేస్తానని 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ పేర్కొన్నారు. పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి యువగళం ముగింపు, నారా భువనేశ్వరి పర్యటన, లోకేశ్ శంఖారావం సభ విజయవంతానికి ఎంతో కృషి చేశామన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతుందని, దీని నుంచి ప్రజలను విముక్తి కల్పించేందుకు రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం శ్రమిస్తామన్నారు. పార్టీ విజయం కోసం తనకు ఏ పని అప్పగించినా అందరి సహకారంతో చేస్తానని నల్లూరి సూర్యనారాయణ పేర్కొన్నారు.

పని ప్రదేశంలో భద్రత చాలా ముఖ్యం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20: పని ప్రదేశంలో భద్రత చాలా ముఖ్యమని స్టీల్ ప్లాంట్ జోనల్ భద్రతాధికారి బయ్యే మల్లయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగంలో మంగళవారం ప్రాథమిక చికిత్స అత్యవసర రెస్పాన్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భద్రతపైనే ప్లాంట్ ఆధారపడి ఉంటుందన్నారు. పనిచేసే సమయంలో అందరూ చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులున్నా సమీపంలోని అధికారులకు తెలపాలన్నారు. భద్రతా పనిముట్లు ధరించి విధులు నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు భద్రతపై పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఎంవీఎస్ దుర్గాప్రసాద్, బుజ్జి, వర్మ, శ్రీనివాస్, నరేంద్ర, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్య వ్యర్థాలతో ప్రమాదాలు



యారాడ బస్టాప్ సమీపాన చెట్టు కొమ్మలు, వ్యర్థాలు

సింధియా, ఫిబ్రవరి 20: సింధియా న్యూకాలనీ యారాడ బస్టాప్ ప్రధాన మార్గంలో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి రోడ్డు మధ్యలో పడేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటివల్ల వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు ఢీ కొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మరోవైపు జీవీఎంసీ శానిటరీ సిబ్బంది శుభ్రపరుస్తున్నా, మర్నాడు మళ్లీ యథావిధిగా చెట్ల కొమ్మలు, వ్యర్థాలను పడేస్తుండడంతో ఇక్కడి పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రహదారి మధ్య చెత్తాచెదారాలు వేయకుండా చూడాలని ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడు 'సిద్ధం' సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను హరిస్తుండడం దారుణమన్నారు. శ్రీకృష్ణపై అత్యంత కిరాతకంగా దాడి చేసి గాయపరచడం సిగ్గుచేటన్నారు. ఈ దానికి అన్ని వర్గాల వారు ఖండించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ తులసికి సత్కారం

ఎన్.ఎ.డి. జంక్షన్, ఫిబ్రవరి 20: సింహాచలం డిపో అసిస్టెంట్ మేనేజర్ తులసి విశాఖ రీజియన్ ఆర్ఎం కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆమెను డిపో మేనేజర్ రాజశేఖర్, ఎన్ఎంయూ కార్మికులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా తులసి అందించిన సేవలను కొనియాడారు. ఎన్ఎంయూ నాయకులు డీపీ నాయుడు, జేఎస్ఎన్ రాజు, శివాజీ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

శంఖారావం సభలకు అపూర్వ స్పందన

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 20: ఉత్తరాంధ్రలో లోకేష్ సభలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం గాజువాకలో జరిగిన శంఖారావం సభ సక్సెస్ అయిందని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం తథ్యమని, వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీమూకలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం అమానుషమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పులి వెంకటరణారెడ్డి, కోగంటి లెనిన్ బాబు, బలగ బాలునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకున్న లోకేశ్

రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన యువనేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నారా లోకేశ్

భీమునిపట్నం, ఫిబ్రవరి 20: ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అండగా నిలిచారు. కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందించారు. బీచ్‌రోడ్డులోని చేపలుప్పాడకు చెందిన టీడీపీ కార్యకర్త దౌలపల్లి రవి ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతని కుటుంబ పరిస్థితిని పార్టీ నాలుగో వార్డు అధ్యక్షుడు పాసి నరసింగరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజబాబు పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన లోకేశ్ దృష్టికి పల్లా తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన లోకేశ్ సోమవారం బాధిత కుటుంబాన్ని నగరానికి పిలిపించి, పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో కారి అప్పారావు, గజ్జి రాజు, పాసి త్రినాథకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



గోపాలపట్నం, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో 'సిద్ధం' సభలో సీఎం జగన్ అభివృద్ధిపై చర్చకు తెరతీయడం హాస్యాస్పదంగా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని తమ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. జగన్ నియంతృత్వ పోకడల వల్ల రాష్ట్రానికి రావాల్సి పెట్టుబడులు పక్కరాష్ట్రానికి తరలిపోయాయని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు రూ.పది ఇచ్చి వారి నుంచి రూ.వంద వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ధరల నియంత్రణలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలను అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గణబాబు పేర్కొన్నారు.

దయాళ్‌నగర్‌లో ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 20: దయాళ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవారికి సుప్రభాత సేవ అనంతరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, కార్మిక నాయకుడు డీవీ రమణ, తదితరులు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్నా బండారు, తదితరులు

వేపగుంట, ఫిబ్రవరి 20: జీవీఎంసీ 94వ వార్డు సేనాతివానిపాలెంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి పూజలు చేయడంతో పాటు ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం జరిగిన పూజల్లో మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ బల్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొబ్బర నరసింహనాయుడు, జి.అప్పారావు, ఎం.కిరణ్, ఆర్.సుబ్రహ్మణ్యం, శేషు, అప్పారావు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాన్ని షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారిని నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యనారాయణ, లీలావతి, పవన్, సత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సింగాలమ్మపురంలో డ్రైనేజీలో మురుగు నీరు


ఏఎస్ఆర్ నగర్‌లో దుస్థితి..

అధ్వానంగా డ్రైనేజీలు

» 45వ వార్డు పరిధిలో దుస్థితి
» పొంచి ఉన్న వ్యాధుల భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 20: గ్రేటర్ 45వ వార్డు పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. పలు వీధుల్లో కాలువలకు చాలా ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసనకు ముక్కుమూసుకొని వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. పలుచోట్ల డ్రైనేజీలకు ఇరువైపులా గట్లు విరిగిపోవడంతో వర్షాలు కురిసే సమయంలో మురుగునీరు రహదారులపై పారుతోంది. స్థానికులు ఇళ్లనుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వాటిలోని చెత్త చెదారాలను సకాలంలో తొలగించకపోవడంతో సమస్యలు అధికమవుతున్నాయి. డ్రైనేజీల్లో మురుగునీరు,చెత్తలతో నిండిపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నారు. వీధుల్లో జనాలను వ్యాధులతో భయాందోళన చెందుతున్నారు. సింగాలమ్మపురం, ఏఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య అధికంగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీల ఇరువైపులా విరిగిపోయిన గట్టు నిర్మించాలని, లేకుంటే పునఃనిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'పాలగుమ్మి'కి ఘంటసాల సేవా పురస్కారం


రాజగోపాల్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20: సినీ నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా సేవలందిస్తున్న పాలగుమ్మి రాజగోపాల్‌కు ఘంటసాల స్మారక ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు హాజరై మాట్లాడుతూ సాలూరి రాజేశ్వరరావు వద్ద రాజ్‌గోపాల్ సహాయకునిగా ఉంటూ పలు చిత్రాలకు, అల్బమ్స్‌కు స్వరకర్తగాపనిచేయడమే కాక ఎన్నో సినిమా పాటలు పాడారన్నారు.సంస్థ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కళావేదిక ట్రస్ట్ అధ్యక్షుడు నండూరి రామకృష్ణ, గంటి మురళి, కొణతాలరాజు, జనార్దన్, యాదకుమార్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం విజయవంతం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ సొంత కుటుంబ సభ్యులను రక్షించుకోలేని వ్యక్తి ఇక్కడకు కొత్తగా వచ్చాడని, ఆయనకు ఓటేస్తే మొత్తం భూములు కొట్టేస్తారంటూ ఎంవీవీ సత్యనారాయణను ఉద్దేశించి విమర్శించారు. మద్దిలపాలెం, హనుమంతువాకలో ఫ్లైఓవర్లు నిర్మిస్తామని, జాతీయ రహదారిపై పలుచోట్ల ప్రజలు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ఫుట్ బిడ్జిలు నిర్మిస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారి, అడ్డగోలుగా సంపాదించాడన్నారు. అటువంటి వ్యక్తులకు పార్టీలో చోటు లేదని స్పష్టంచేశారు. వన్‌టౌన్‌లో స్టేడియాన్ని, ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకరిస్తామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం సభలో కేకే రాజు గూండా గిరి చేస్తున్నాడని, నియోజకవర్గాన్ని గంజాయికి కేంద్రంగా చేశాడని దుయ్యబట్టారు. గాజువాక సభలో తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఉక్కు భూములు అమ్మకానికి పొరుగు రాష్ట్రంలో ప్రకటన జారీచేయడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం కనిపిస్తోందంటూ మండిపడ్డారు. త్వరలో ఏర్పడనున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో విశాఖను అన్ని రకాలుగా ఆదుకుంటామని స్పష్టంచేశారు. గడిచిన ఎన్నికల్లో రాష్ట్రమంతా టీడీపీకి ఎదురుగాలి వీచినా..విశాఖ నగరంలోని మాత్రం నాలుగు నియోజకవర్గాల్లో ప్రజలు టీడీపీ ఆదరించారని, ఇక్కడి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటామని చెప్పడం ద్వారా విశాఖ ప్రజల పట్ల తనకున్న కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీకి పెద్దపీట వేస్తానని, మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయిస్తానని లోకేశ్ హామీ ఇవ్వడం ద్వారా ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. మొత్తంగా లోకేశ్ పర్యటన విజయవంతం కావడంతో పార్టీ నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జనాన్ని తెండి...

... 5వ పేజీ తరువాయి

సూచించారు. విమానాశ్రయంలో టోల్‌ప్లాజా మొదలుకొని విమాననగర్ బస్టాప్, ఈటర్స్ స్టాపు, దుర్గానగర్ బస్టాప్, బిగ్ న్యూ మొబైల్ షాపు, విజేత సూపర్ మార్కెట్, రిలయన్స్ డిజిటల్స్, లక్ష్మీ షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, సింహాచలం పెట్రోల్ బంకు, గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రి, భారతి కల్యాణ మండపం, వేపగుంట జంక్షన్, జోన్-8 కార్యాలయం...ఇలా చినముషిడివాడ జంక్షన్ వరకు 24 పాయింట్లు గుర్తించారు. పాయింట్‌కు 500 మంది చొప్పున మొత్తం పది వేల మందికి తక్కువ లేకుండా జనాలను తేవాలని ఆదేశాలు అందాయి. ఏయే వార్డుల నుంచి జనాలను తీసుకురావాలో కూడా సూచించడం గమనార్హం. పశ్చిమ, పెందుర్తి, భీమిలి నియోజకవర్గాలకు చెందినవారితో పాటు 90, 91, 92, 94, 95, 97 వార్డులకు చెందిన వారిని తీసుకురావాలని చెప్పారు. విమానాశ్రయం నుంచి ఎక్కడా ఆగకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇది ఎన్నికల సీజన్ కాబట్టి కారు అద్దాలు దించి, చేతులు ఊపుతూ వెళతారని, అందుకే ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు.

2 గంటల్లో 187 అంశాలు

... 5వ పేజీ తరువాయి

తయారుచేస్తారు. అలాంటిది స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఒకేసారి 187 అంశాలను పొందుపరచడం, రెండు గంటల్లోపే వాటన్నింటినీ ఆమోదించడం చర్చనీయాంశంగా మారింది. పైగా స్టాండింగ్ కమిటీ ఎజెండాలో చేర్చిన కొన్ని పనులను ఇప్పటికే పూర్తి చేసేశారు. అలాంటి అంశాలకు ఇప్పుడు పరిపాలనా ఆమోదం ఇవ్వాలంటూ స్టాండింగ్ కమిటీ ముందుపెట్టిన అధికారులను సభ్యులు ఉతికిఆరేయాలి. కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా అభ్యంతరం లేవనెత్తకపోవడం అనేక అనుమానాలకు తావిచ్చింది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీవీఎంసీ దుకాణాల లీజులు పొడిగింపు, వేలం, ఆశీలు వసూలు, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్య విభాగంతో పాటు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో సభ్యులతోపాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి'


ఏపీఎన్‌జీవో నేతకు వినతి పత్రాన్ని అందిస్తున్న స్టాఫ్ నర్సులు

మహారాణిపేట, ఫిబ్రవరి 20: కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల స్ట్రగుల్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఎన్‌జీవో భవన్‌లో ఎన్‌జీవోజిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావును కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి కాంట్రాక్ట్ నర్సుల సమస్యలుతెలిపి,పరిష్కారానికి కృషి చేయాలని ఎన్‌జీవో అసోసియేషన్‌ను కోరామన్నారు. రెగ్యులర్ చేసే వరకు వంద శాతం గ్రాస్ శాలరీ వచ్చేలా చర్య లు జరపాలని సూచించారు. సమావేశం లో నర్సింగ్ అసోసియేషన్ నాయకులు పిట్టా వరలక్ష్మి, లక్ష్మి, గంగా భవాని, లక్ష్మి, జ్ఞానాంబ, శ్రీగౌరీ మంగ, కోటేశ్వరరావు బాలమణి, ప్రశాంతి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో హరిహర నామ సంకీర్తన


పూజల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 20: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో 24 గంటల హరిహర నామ సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, టీడీపీ 42వవార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, నాయకులు లక్ష్మీ శివప్రసాద్, ముక్కి రామకృష్ణ, మజ్జి వెంకట సత్యనారాయణ, గంగరాజు, గురుగోవింద్ సింగ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జగన్ స్వప్రయోజనాలకు రాష్ట్రం తాకట్టు

» ఏఐవైఎఫ్ ప్రతినిధి రాంబాబు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

అల్లిపురం, ఫిబ్రవరి 20: సొంత ప్రయోజనాలకోసం తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర ప్ర యోజనాలను బీజేపీ పెద్దల వద్ద జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రతినిదులు వై. రాంబాబు, కె. అచ్యుతరావు విమర్శించారు. మంగళవారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి కోసం కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలువంచి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను సాధిస్తానని చెప్పిన జగన్.. ఇప్పుడు మెజారిటీ అంటూ సాకులు చెబుతున్నారనిఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖకు ఎన్నిసార్లు వస్తున్నా స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూశారా.. అని ప్రశ్నించారు. నిరుద్యోగులను నమ్మించి వారి జీవితాలతో ఆడుతున్న జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దింపడమే ఏఐవైఎఫ్ ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. సమావేశంలోనాయకులు నాగరాజు, సాయి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పంచాలి

» జిల్లా రిజిస్ట్రార్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ బాలకృష్ణ


ప్రసంగిస్తున్న డీఐజీ బాలకృష్ణ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 20: ప్రతీ విద్యార్థి విజ్ఞానాన్ని సంపాదించి మరో పది మందికి ఆ జ్ఞానాన్ని అందించేలా నిలవాలని జిల్లా రిజిస్ట్రార్ అండ్ స్టాంప్స్ విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జి.బాలకృష్ణ సూచించారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో ప్రేమ ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల 72వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గీతం మెడికల్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డా.రమణారావు , ప్రేమ సమాజం ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు మాట్లాడుతూ జీవితంలో ఏం కావాలన్నా చదువు కీలకమన్నారు. కరస్పాండెంట్ డబ్ల్యు.భాస్కరరావు, డా. రాంజీ, ఎడ్యుకేషనల్ కమిటీ చైర్మన్ వి.కె. సురేష్, జగదీష్, కోన జగదీశ్వరరావు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.ప్రతిభ చూసిన విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా బహుమతులందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 20: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఏరియా, రెసోనెన్స్ స్టడీ సెంటర్, శారద స్కూల్ ఏరియా, శివాలయం వీధి, వివేకానంద కల్యాణమండపం ఏరియాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయగడ స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు


రాయగడ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20: రాయగడ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ మంగళవారం తనిఖీలు చేశారు. ప్రయాణికుల మౌలిక సదుపాయాలకు సంబంధించి చేపట్టిన పాదచారుల వంతెన, పార్కింగ్ ఏరియా, స్టేషన్ భవన అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్పీఎఫ్ బ్యారక్‌ను కూడా పరిశీలించి సదుపాయాల కల్పనపై అధి కారులతో చర్చించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఇప్పటివరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. అక్కడ నుంచి విండో ట్రాలింగ్ ద్వారా పార్వతీపురం, విజయనగరం రైల్వే స్టేషన్లను పరిశీలించి అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తాతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆలయాలకు భీష్మ ఏకాదశి శోభ


అలంకరణలో శ్రీ లీలా మాధవస్వామి

మురళీనగర్, ఫిబ్రవరి 20; భీష్మఏకాదశి వేడుకలను మంగళవారం మాధవధార, మురళీనగర్‌లలో ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. బర్మాక్యాంపు రోడ్డులోని సీతారామచంద్ర స్వామి ఆలయం 25వవార్షికోత్సవ ముగింపు సందర్భంగా సాయంత్రం 7 గంటలకు సీతారామ శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈనెల 18 నుంచి ఈ వేడుకలను శ్రీరామ వినాయక యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించారు. మాధవధార పుణ్య క్షేత్రంలోని శ్రీ మాధవస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ వేడుకలు జరిపారు. మాధవధార ఉడాకాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ 16వ వార్షికోత్సవ సంబరాలు జరిపారు. సాయంత్రం తిరువీధి జరిపారు.

వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు


రైల్వే గ్రౌండ్ కొత్తగా ఏర్పాటుచేసి ఫ్లడ్ లైట్

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 20: వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో కొత్తగా ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. విశాఖ క్రీడారంగంలో ఘన చరిత్ర కలిగిన రైల్వే గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లు అందుబాటులో రావడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్, వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు తదితర అవుట్‌డోర్ క్రీడా మైదానాలలో ఇప్పటికే ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు చేశారు. క్రికెట్ గ్రౌండ్‌లో అమర్చిన ఫ్లడ్‌లైట్లను మంగళవారం రాత్రి ట్రయల్ టెస్టు చేశారు. అయితే ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు వెచ్చించిన వ్యయాన్ని రైల్వే అధికారులు అధికారంగా తెలియజేయాల్సి ఉంది.

భలే కప్ప!


తీరానికి చేరిన ముళ్ల కప్ప కళేబరం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 20: సముద్ర తీరానికి మంగళవారం ఓ ముళ్ల కప్ప కళేబరం కొట్టుకువచ్చింది. దీని శరీరమంతా ముళ్లతో నిండి ఉంది. శత్రువుల నుంచి రక్షించుకునేందుకు ఇది ముళ్లను వినియోగిస్తుంటుందని మత్స్యకారులు తెలిపారు. ఇది ఉభయచర జీవి కాదని, నీటిలోంచి బయటకు వచ్చిన మరుక్షణమే మృత్యువాత పడుతుందన్నారు. వింతగా వున్న కప్పను చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు.

కేజీహెచ్‌లో కేన్సర్ రోగులకు మెరుగైన సేవలు

» హోమీబాబా రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి


నవ్య ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, ఫిబ్రవరి 20: కేజీహెచ్‌లో కేన్సర్ రోగుల జీవన ప్ర మాణాలు మెరుగుపరచడంలో నవ్య ప్రాజెక్టు అపర సంజీవనిలా పనిచేయనుందని టాటా మెమోరియల్ అనుబంధ హోమీబాబా కేన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి అన్నారు. మం గళవారం కేజీహెచ్‌లో టాటా మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో నేషనల్ కేన్సర్ గ్రిడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేజీహెచ్‌లో నవ్య ప్రాజెక్టు ద్వారా కేన్సర్ సేవలకు సంబంధించిన కా ర్యకలాపాలను ప్రారంభించారు. అనంతరం కొంతమంది రోగుల ఆరోగ్య నివేదికలను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి జాతీయస్థాయిలో వైద్య నిపు ణుల సలహా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా కేన్సర్ రోగుల ఆరోగ్యస్థితి, తీవ్రత ఉన్న బాధితులకు అదనపు వైద్య సలహాలు సూచనలిచ్చేందుకు ఆసుపత్రి వైద్యు లకు జాతీయస్థాయి నిపుణులు తోడ్పాటునందిస్తారన్నారు. దీని ద్వారా రోగులకు మెరుగైన చికిత్స చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, రేడియేషన్ అంకాలజీ విభాధిపతి పాండురంగ కుమారి, నవ్య ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ నితిమాధుర్, డాక్టర్లు నరేశ్ రామరాజన్, శిల్ప, రాఘవేంద్ర నాయక్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్న ఆలయ టస్ట్ ప్రమాణం స్వీకారం

అల్లిపురం, ఫిబ్రవరి 20: అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం నూతన ట్రస్ట్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ హాజరై సభ్యులతో ప్రమాణం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బొడ్డేటి కిషోర్, మెంబర్లుగా పాల్తేటి ఊర్వశి, తాడ్డి అనురాధ, కొణతాల కృష్ణవేణి, గంగుల మానస, కొల్లి సత్యవతి, వెలిసెట్టి లక్ష్మి తదితరుల ప్రమాణం చేశారు.

రూ.2500 కోట్ల ఐటీ ఎగుమతులు

» మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,500 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయని ఐటీ, పరిశ్రమలశాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సర్క్యూట్‌హౌస్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో రూ.900 కోట్లు మాత్రమే జరిగాయన్నారు. 2017లో ఐటీ మంత్రిగా లోకేశ్ విశాఖ వచ్చినపుడు ఐటీ కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనువైన పరిస్థితులు లేవన్నారని, కానీతాము250 ఐటీ కంపెనీలను నెలకొల్పామన్నారు.చంద్రబాబు, లోకేశ్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతుడు

కొమ్మాది, ఫిబ్రవరి 20: దిశా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని పారిశుధ్యకార్మికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా, ఇతడు జూపార్కు ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్టు తెలిసిందన్నారు. మృతదేహంపై గాయాలు లేవని, కేజీహెచ్ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు పీఎం పాలెం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

41వ వార్డులో వికసిత్ భారత్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 20: జీవీఎంసీ జోన్-5 యూసీడీ ఆధ్వర్యంలో 41వవార్డు పరిధి జ్ఞానాపురం ఏఎన్ఎస్ఎంయూ ఆర్‌ఎం కాలనీ వద్ద మంగళవారం ప్రధానమంత్రి వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు వంక సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్, బీజేపీ సీనియర్ నాయకులు రామ్‌కుమార్‌లు హాజరై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పథకాల అమలు, ప్రయోజనాలను దృశ్యరూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెలంగణిరావు, యూసీడీ సీఓ సత్యవతి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు నగర బహిష్కరణ పొడిగింపు

కొమ్మాది, ఫిబ్రవరి 20: స్థానిక ఆర్.హెచ్ కాలనీకి చెందిన రౌడీషీటర్ రెహాన్‌ను గతంలో పోలీస్ కమిషనర్ ఏడాది పాటు నగరం నుంచి బహిష్కరించారు. రెహాన్ వ్యవహార శైలిని దృష్టిలో పెట్టుకుని అతడి నగర బహిష్కరణను మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

ఏ దారెటుపోతుందో?

» తప్పులు తడకగా దిక్సూచీలు


కైలాసగిరి వైపు హెల్త్‌సిటీ, నగరంలోకి ఆరిలోవ మార్గాలను సూచిస్తున్న బోరు


నగరంవైపు జూ, జూవైపు వెంకోజీపాలెం, ఇసుకతోటను సూచిస్తున్న మార్కులు

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 20: ఎద్దు ఈనిందంటే నీడన కట్టేయ్ అన్నాడట ఓ పెద్ద మనిషి. అలా ఉంది అధికారుల పరిస్థితి. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇటీవల ప్రకటనల కోసం భారీ నిర్మాణాలను చేపట్టిన విషయం తెలిసిందే. వాటికి ఏ దారి ఎటు వెళ్తుందో సూచించే బోర్డులను కూడా ఏర్పాటుచేశారు. ఏదోలా కట్టేయండంటూ అధికారులు చెప్పారో, లేదా బోర్డులు అమర్చేవాడికి ఇంగ్లీషు పరిజ్ఞానం లేదోగాని మార్గాలు తికమకగా సూచించేలా అమర్చాడు. దాదాపు నెల రోజులు దాటుతున్నా ఈ బోర్డులను అధికారులు మార్చలేదు. అధికారుల దృష్టికి రావడంతో వాటికి ఓ వస్త్రాన్ని కప్పేయాలని సూచించారట ఘనతగన్న మహా విశాఖ అధికారులు. హనుమంతువాక నుంచి ముడసర్లోవ వెళ్లే రోడ్డులో ప్రయాణిస్తే... హెల్త్‌సిటీ, ఆరిలోవ మార్గాలను సూచించే బోర్డులు ఉండాలి. కానీ నగరంవైపు చూపిస్తూ జూ పార్కు, పి.ఎం.పాలెం క్రికెట్ స్టేడియం, జూ పార్కు వైపునకు వెంకోజీపాలెం, ఇసుకతోట మార్గాలను సూచిస్తున్నాయి. ఇక ముడసర్లోవ వైపు నుంచి హెల్త్‌సిటీ, ఆరిలోవ దాటుకుని జాతీయ రహదారిపైకి వచ్చేటపుడు హెల్త్‌సిటీ కైలాసగిరివైపు, ఆరిలోవ నగరంలోకి వెళ్లే మార్గం సూచిస్తున్నాయి. కనీసం వీటిని అమర్చే సమయంలో పర్యవేక్షించేవారు కూడా లేకపోతే పరిస్థితి ఇలానే ఉంటుందని నగరవాసులు విమరిస్తున్నారు.

ఆలోచింపచేసే చిత్రం 'సుందరం మాస్టర్'

» హీరో హర్ష


మాట్లాడుతున్న హీరో హర్ష

ఎం.వి.పి.కాలనీ, ఫిబ్రవరి 20: సుందరం మాస్టర్ సినిమా అందరిని ఆలోచింపచేసేదిగా ఉంటుందని ఆ సినిమా హీరో హర్ష అన్నారు. వైవా హర్ష, దివ్య శ్రీపాద జంటగా నటించిన సుందరం మాస్టర్ ఈ నెల 23వతేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం నగరంలోని ఎం.వి.పి.కాలనీలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో హర్ష మాట్లాడారు. ఈ చిత్రం టీజర్, ట్రయిలర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. హీరో రవితేజ ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎదిగారన్నారు. ఆయన నిర్మాతగా తీసిన సినిమా ద్వారా హీరోగా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. తన స్నేహితుడు హీరో సాయిధరమ్ తేజ్ చేతులమీదుగా చిత్ర టీజర్, మెగా స్టార్ చిరంజీవి చేతులమీదుగా ట్రయిలర్ విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. గోల్డెన్ మీడియా అధినేతలది గాజువాక అని పేర్కొన్నారు. పాడేరు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇది ఫీల్‌గుడ్ మూవీ అని ఆర్ట్ డైరెక్టర్ చంద్రమౌళి అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఫిబ్రవరి 20: నిర్వహణ పనుల నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్ 3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మారికివలస కూడలి, మారికివలస, బోరవానిపాలెం, జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, డ్రైవర్స్ కాలనీ, జె.కె.లేఅవుట్, కొత్తపరదేశిపాలెం, పాతపరదేశిపాలెం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మానసిక ఆరోగ్యం అవసరం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 20: ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని, వ్యక్తుల ఆలోచనలు, ఉద్రేకాలు, ప్రవర్తన, వైఖరులు మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయని ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఎంపవర్ కార్యక్రమ సైకాలజిస్టు మౌనికారావు అన్నారు. ఏయూలో మంగళవారం ప్రోగ్రాం అధికారులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతూ అపోహలను పోగొట్టడానికి, ధైర్యాన్ని ఇవ్వడానికి, సమస్యల పరిష్కారానికి, ఆత్మహత్యల నివారణకు శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపవర్ స్టేట్ కో-ఆర్డినేటర్ బి.సుధాకరరావు ఒత్తిడిని తట్టుకునే మార్గాలను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం: వీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 20: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఉపకరిస్తాయని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. అభివృద్ధి చేసిన షటిల్ కోర్టులను మంగళవారం ఆయన ప్రారంభించారు. సిబ్బంది స్పందించి ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దినందుకు హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీలో మరిన్ని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎ.నరసింహారావు, ఎ.పల్లవి, ఎన్.విజయ్‌మోహన్, జి.వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీడీ సమస్యను పరిష్కరించండి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 20: గ్రేటర్ 15వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో ఏర్పడుతున్న సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఎంపీ, ఎంవీవీ సత్యనారాయణను స్థానికులు కోరారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో పర్యటించిన ఎంపీకి సమస్యను చూపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఎ.గిరిబాబు, పీల వెంకటపరదేశినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ, ఫిబ్రవరి 20: హనుమంతవాక కూడలి సమీపంలోని విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. అమ్మవారిని 108 క్షీర కలశాలతో అభిషేకించారు. వేద పండితులు మావుడూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో గులాబీలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఆలయంలో సామూహిక లక్షకుంకుమార్చన, ముగింపు సందర్భంగా పరస, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరాజు రాజు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేత్ర పర్వంగా శ్రీవారి తిరుకల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 20: కొండదిగువ పూలతోటలో కొలువైన వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం మంగళవారం జరిగింది. ఈనెల 19న అంకురారోపణతో శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణ, సాయంత్రం సింహాచలం ప్రధాన మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. రాత్రి తిరుకల్యాణ మహోత్సవం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు, అక్షతలను పంపిణీ చేశారు. ఏఈఓ పాలూరి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 48, బీరకాయలు 55, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 22, క్యారెట్ 20, దొండకాయలు 40, బంగాళాదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 106, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 34 , కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	123
ఫారం ధర	--	143
విత్ స్కిన్	--	256
స్కిన్‌లెస్	--	266

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

చిల్లపేట చెరువు ఆధునికీకరణ ఎన్నటికి పూర్తయ్యేనో?

తగరపువలస, ఫిబ్రవరి 20: స్థానిక చిల్లపేట చెరువు పనులను అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఐదేళ్లనుంచి ఈ చెరువును ఆధునికీకరిస్తామని నాయకులు చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. హైదరాబాద్‌లో టాంక్ బండ్ తరహాలో చుట్టూగట్టు నిర్మించి మధ్యలో బోట్ షికారుతో పార్కు నిర్మించాలనే ఆలోచన చేశారు. జీవీఎంసీ. పర్యాటకశాఖలు సంయుక్తంగా నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. ఆ తర్వాతఈ చెరువుకు తూర్పులో ఉన్న బొగ్గురోడ్డు వైపు మాత్రం గట్టును ఎత్తు చేసి రహదారి మాదిరిగా నిర్మించి వదిలిపెట్టారు. ఈ ప్రాంత నాయకులు చెరువు ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఎన్నోసార్లు వినతులిచ్చిన మేరకు ఆరునెలల క్రితం మట్టి పూడిక తీసి దానిని చెరువు గట్టుగా వేసి వదిలిపెట్టారు. ఈ చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని, చేపల పెంపకాన్ని నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చెరువు తగరపువలస భీమిలి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటం వల్ల అభివృద్ధి చేస్తే రెండు గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని వైసీపీ నాయకులు జోనల్ కమిషనర్‌కు ఇటీవల వినతిపత్రం కూడా అందించారు.



చెరువు పూడిక మట్టితో వేసిన గట్టు

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకున్న లోకేశ్

» రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన యువనేత



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నారా లోకేశ్

భీమునిపట్నం, ఫిబ్రవరి 20: ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అండగా నిలిచారు. కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. బీచ్‌రోడ్డులోని చేపలుప్పాడకు చెందిన టీడీపీ కార్యకర్త దౌలపల్లి రవి ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతని కుటుంబ పరిస్థితిని పార్టీ నాలుగో వార్డు అధ్యక్షుడు పాసి నరసింగరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజబాబు పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన లోకేశ్ దృష్టికి పల్లా తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన లోకేశ్ సోమవారం బాధిత కుటుంబాన్ని నగరానికి పిలిపించి, పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో కారి అప్పారావు, గజ్జి రాజు, పాసి త్రినాథకుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై లోకేశ్‌కు వినతి

ఆనందపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అనకాపల్లిలో మంగళవారం నిర్వహించిన శంఖారావం సభలో యాతకులస్థుల సమస్యలపై టీడీపీ బీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంగటి రాము వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాంధ్రలో ఆరు లక్షల మందికి పైగా ఉన్న యాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు కార్యక్రమంలో అంగటి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధిని పరిశీలించిన కేంద్ర బృందం



ఆర్‌పీపురం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పద్మనాభం, ఫిబ్రవరి 20: మండలంలోని ఆర్‌వీ పురం జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని (ఎల్‌ఐపీ) మంగళవారం రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ విధానం ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందుతాయన్నారు. ప్రాక్టీస్ పీరియడ్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాఠశాల గ్రంథాలయం, సైన్స్ ల్యాబొరేటరీలను పరిశీలించారు. ప్రయోగశాలలో విద్యార్థుల యాక్టివిటీపై రికార్డు నిర్వహించాలన్నారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్‌లో బహుమతి పొందిన దివ్యను అభినందించారు. ఈకార్యక్రమంలో భీమిలి డైట్ వైస్ ప్రిన్సిపాల్ భారతమ్మ, రాష్ట్ర బృందం సభ్యులు రాంబాబు, రామనాథ్, త్రినాద్, హెచ్‌ఎం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం : మేయర్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరికుమారి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 20: మహిళల్లో అత్యంత సాధారణంగా వచ్చే రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మహిళా ఉద్యోగుల కోసం రోటరీక్లబ్, లైవ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము కేన్సర్ పరీక్ష శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్వీయ పరీక్షలు చేసుకుని, అనుమానం ఉంటే వైద్యుని సంప్రదించాలన్నారు. ముఖ్యంగా 30 సంవత్సరాల వయసు దాటిన వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో 30 మంది ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, లైవ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ డా.సుమన్, ప్రెసిడెంట్ డి.ఎం.రావు, మెడికల్ అధికారి డాక్టర్ సరస్వతి భాయ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలతో సమాజానికి మేలు

వెంకోజీపాలెం: చిన్నారుల్లో సత్ప్రవర్తన, నడవడిక, పెద్దలపై విధేయత కలిగేలా మంచి పుస్తకాలు, రచనలు అవసరమని మేయర్ హరి వెంకటకుమారి పేర్కొన్నారు. తన చాంబర్లో జీవీఎంసీ ఉద్యోగి మోహన్‌కుమార్ ఆవుపాటి రచించిన ఎన్సూరింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎర్లీ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని మంగళవారం ఆమె ఆవిష్కరించారు. జీవీఎంసీ బాల్యం విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తన అధ్యయనంలో భాగంగా రచించిన పుస్తకం 'పెన్స్ ఆఫ్ ఆనర్' అవార్డు పొందిందన్నారు. ఈ సందర్భంగా అతనిని అభినందించి, జ్ఞాపికను బహూకరించారు.

పారిశ్రామిక ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 20: పారిశ్రామిక ప్రగతిలో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర కీలకమని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఇండియా) విశాఖ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమల్లో ఉత్పాదకతను పెంచాల్సిన బాధ్యత మెకానికల్ ఇంజనీర్లపై ఉందన్నారు. ఆటోమేషన్, రోబోటిక్ రంగంలో విప్లవాత్మక మార్పులు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద్

భీమునిపట్నం, ఫిబ్రవరి 20: ఎన్నికల విధులను బూత్ లెవల్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తహసీల్దార్ టి.గోవింద్ అన్నారు. మంగళవారం బీఎల్‌వోలకు ఎన్నికల విధులు, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలన్నారు. ఫారం 6,7,8 లపై వివరించారు. ఓటరు జాబితాల రూపకల్పనలతో మంచి పాలనను ప్రజలు ఎన్నుకునే అవకాశం ప్రజలకు కలుగుతుందన్నారు. నీతి, నిజాయితీగా ఓటు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ఈసారి ఎన్నికల్లో 40 శాతం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్ల వయస్సు నిండినవారికి ఇళ్ల వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. వీరి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ డి.శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ జె.భాస్కరరావు, సీఎస్‌డీటీ కె.శ్రీనివాసరావు, ఎఎస్‌వో జి.శేషాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయండి: డీఈవో



పరీక్ష కిట్లతో ఉపాధ్యాయులు, స్వాగా సంస్థ సభ్యులు



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో చంద్రకళ

సింహాచలం, ఫిబ్రవరి 20: త్వరలో జరగనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులను డీఈవో చంద్రకళ ఆదేశించారు. అడివివరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఆంగ్ల స్కూల్ కాంప్లెక్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇంటరాక్టివ్ ప్లాంట్ ప్యానల్(ఐఈపి) ప్రాముఖ్యత, వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. విద్యార్థులంతా తప్పనిసరిగా ట్యాబ్‌లు ఉపయోగించే విధంగా శిక్షణ ఇవ్వాలని, టీచర్లు వినియోగించాల్సిందేనన్నారు. ఏప్రిల్‌లో జరిగే ఎఫ్‌ఏ-4 పరీక్షలకు సంబంధించి కోర్సులను సకాలంలో పూర్తిచేసి విద్యార్థుల నోట్సును దిద్దాలన్నారు. మార్చి 2న సెల్ఫీ విత్ టాపర్స్‌ను అన్ని సబ్జెక్టుల్లో నిర్వహించాలన్నారు. పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్, ఎస్ఎస్ ఏపీసీ అధికారి శ్రీనివాస్, ఎంఈవో రవీంద్రబాబు, హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమంగా రాణించాలి

ఆరిలోవ: పరీక్షలపై భయం పోగొట్టుకుని, ఉత్తమంగా రాణించాలని అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. శ్రీకృష్ణాపురం గురుకులంలో మంగళవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు స్వాగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.కైలాస్, జిల్లా అధ్యక్షుడు పి.రాజు, ప్రధాన కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంకర రత్నవల్లి, స్వాగా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి



లక్ష్మీనారాయణులకు తులసిమాలలతో అలంకరణ

కొమ్మాది, ఫిబ్రవరి 20: అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీదేవాలయంలో భీష్మఏకాదశి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.లక్ష్మీనారాయణులను తులసిమాలలతో అలంకరించారు. విష్ణుసహస్రనామస్తోత్రం ఆవిర్భవించిన రోజును అర్చకులు చామర్తి శ్రీధర్ భక్తులకు వివరించారు.

బీజేపీ ట్రేడర్స్ సెల్ కన్వీనర్‌గా కురిచేటి

పెదవాల్తేరు, ఫిబ్రవరి 20: భారతీయ జనతా పార్టీ ట్రేడర్స్ కన్వీనర్‌గా కురిచేటి రామచంద్రమూర్తిను నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర నియామక పత్రాన్ని అందజేశారు. ఎ.కేశవకాంత్, కె.సుహాసిని ఆనంద్, ప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

620 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, ఫిబ్రవరి 20: సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 620 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 40మందికి కళ్లద్దాలు సిఫారసు చేశారు. ఎంపీపీ కె.రాంబాబు మందుల కిట్లను అందజేశారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, సర్పంచ్ పాప, పద్దు, నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెబుతాం

» విశాఖ స్వచ్ఛంద క్రైస్తవ సమాజం ప్రతినిధులు



నిరసన తెలుపుతున్న విశాఖ క్రైస్తవ సమాజం ప్రతినిధులు

సిరిపురం, ఫిబ్రవరి 20: వచ్చే ఎన్నికల్లో వైసీపీ సర్కార్‌కు బుద్ధి చెబుతామని విశాఖ స్వచ్ఛంద క్రైస్తవ సమాజం ప్రతినిధులు తేల్చిచెప్పారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంస్థ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతినిధి హనీజాన్సన్ మాట్లాడుతూ క్రైస్తవ మైనారిటీలపై దాడుల నిరోధక చట్టం రూపొందించాలన్నారు. మైనారిటీల ఆస్తులు, చర్చిలకు చట్టభద్రత కల్పించాలన్నారు. క్రైస్తవులపై దాడులు జరుగుతున్నప్పటికీ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్న వైసీపీకి ఇవే ఆఖరి ఎన్నికలన్నారు. క్రైస్తవులతో ఇక నుంచి తెల్లని దుస్తులు ధరించమని బలవంతంగా రాయించుకోవడం, తాళ్లపాలెంలో క్రైస్తవులపై దాడి, రాంబిల్లిలో చర్చిని కాల్చివేయడంపై సమాజం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో వీకే జేమ్స్, నజీరీన్, ఎం.జోసెఫ్‌ప్రకాష్, కె.ఈశ్వర్ డానియేల్, వీకే జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్‌పై ఇంటింటికీ ప్రచారం చేయాలి'



కార్యకర్తల అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

భీమునిపట్నం, ఫిబ్రవరి 20: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు రూపొందించిన చంద్రన్న సూపర్ సిక్స్ పథకాలను ప్రతీ గడపకు చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యకర్తల అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ లోకేశ్‌బాబు శంఖారావం సభలలో సూపర్‌సిక్స్ మేనిఫెస్టోపై విపులంగా వివరించారన్నారు. బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు దీనిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి రోజు 50 ఇళ్లకు సూపర్‌సిక్స్ క్యాలెండర్లను అందజేయాలన్నారు. సమావేశంలో దంతులూరి అప్పలనరసింహరాజు, దామోదరరావు, లీలావతి, గొల్లంగి ఆనంద్‌బాబు, మూడు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే

ఆనందపురం ఫిబ్రవరి 20: వలంటీర్ల సేవలు వెలకట్టలేమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాలవలసలో పలువురు వలంటీర్లను గుర్తించి మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, మహంతి శివాజీ, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

థీమ్ పార్కు ప్రారంభం

ఎండాడ: సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌ఎల్‌పీ లే అవుట్‌లో థీమ్ పార్కుని ఆయన ప్రారంభించారు. బీసీ కాలనీలోని రహదారులు, కొండవాలు ప్రాంతంలోని మెట్లు, శెట్టి బలిజ సామాజిక భవన నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ శ్రీధర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కరపత్రాలు విడుదల

భీమునిపట్నం, ఫిబ్రవరి 20: భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గిడుతూరి శ్రీనివాసరావు (డెక్కన్), పీరుపిల్లి రాజు మాట్లాడుతూ ఏప్రిల్ 7 నుంచి 10 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

అప్పన్నకు ఘనంగా తులసి దళార్చన

సింహాచలం, ఫిబ్రవరి 20: వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం స్వర్ణ తులసీ దళార్చన జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఉదయం 9.30 గంటలకు నిత్యకల్యాణాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎండాడ, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మధురవాడకు చెందిన నాగోతి ఆనంద్ ద్విచక్ర వాహనంపై ఎండాడ వస్తుండగా దిశా స్టేషన్ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు.